# 'కుక్క+కోడి+పిల్లి=ఆపద'

## శ్రీరామ. శశికళ

ఓ రోజు

సాయం సమయం.

రామారావు వాలు కుర్చీలో కూచుని, ఆవాళ్టి పత్రికను తిరగేస్తున్నాడు. మధ్య మధ్యలో గేటవతల వున్న వీధిలో కేసి ఓ మారు చూస్తూవున్నాడు. వీధిలో-యింటెదురుగా వున్న ఓ వేప చెట్టు కింద-ఓ నల్ల కుక్క (ఆడ కుక్కలాగే వుందది) కుయ్యిం.. కుయ్యిం....మంటూ ముడుచుకొని పడుకొని వుంది. ఓ నలుగు రైదుగురు ఆకతాయి పిల్లలు దాని మీదకి రాళ్ళు రువ్వుతున్నా అక్కడ్నించి లేవ దానికిష్టం లేనట్టు అక్కడే పడు కొని వుందా కుక్క.

రామారావుకి వయస్సు దాదాపు ఐదు పదులుండచ్చు. ఎందుకో చిన్నప్పుడు తనూ, సూరిగాడూ ఆడిన ఆటల్లో ఇలాగే ఓ నలుగురైదుగురు కల్సి ఓ కుక్కని చావ బాదితే, ఆ తర్వాత యింటి దగ్గర అమ్మ దగ్గర చింత బరికెతో తిన్న దెబ్బలూ గుర్తొచ్చి, చిరునవ్వు మెదలగా కుర్చీలో అటూ యిటూ కదిలాడు.

నల్ల కుక్క గబుక్కున లేచింటెందుకో కంగారుగా! అటు కేసి చూశాడు రామారావు. ఎక్కణ్ణుంచొచ్చిందో ఒక మ కుక్క, కోసిన చెవులూ, తోకతో, గుండుగా, మొండిగా వుందది. దూకుడుగా వచ్చి నల్ల కుక్క మీద పడింది "కుయ్యోం" మంటూ అరచి, గుర్రుగా చూసిందా నల్లకుక్క.

తర్వాత -

నల్ల కుక్క వెనుగు లాడింది-, అరిచింది, గోలచేసింది, చివరకు లొంగి పోయింది. రెండు కుక్కలూ జంటగా నిల్చున్నాయ్ కాస్సేపటి తర్వాత.

"హేయ్! హేయ్!" అంటూ తరిమేశాడు రామారావు ఆకుక్కల్ని. వెళ్ళి పోయాయవి జంటగానే.

o o o o

యింకోరోజు-

మధ్యాహ్నం కావస్తూంది. రామారావు అప్పుడే భోంచేశాడు. భుక్తాయాసంగా వరండాలో నిల్చున్నాడు. రామారావింట్లో ఓ కోడిపెట్టుంది. అది ఆరోజెందుకో నక్కి నక్కి వుంటోంది.

"ఏమే! కోడికి నూకలేశావా?"

"ఆ! వేశానండీ! అరెరె! అదేవిటీ ఆ కోడిమీద ఓ పుంజు పడిపోతూంది. దానికసలే యీరోజు వొంట్లో బావో



లేదు. అరెరె! హేయ్! హేయ్! షూ! షూ!" అంటూ తరిమిందావిడ. అది వెళ్ళలేదు.

"ఏమండీ! అలా దాన్ని తరమండి. ఇంట్లో కుక్క దూరినట్టుంది" అంటూ లోపలికెళ్ళింది. రామారావు చేతికందిన కర్రతో దానిని తరమబోయాడు. పుంజు పెట్టని తరుముతోంది. పెట్ట పరిగెడుతోంది.

ఆ తర్వాత -

పుంజు గెల్చింది!!

పెట్ట వోడిపోయింది!!!

లొంగిపోయింది! పుంజు విజయగర్వంతో దుమ్ము దులుపుకుంటూ వెళ్ళిపోయింది. పెట్ట కుంటుతూ లోనికొచ్చి పడుకొని "క్కొక్కొక్కొ" అంటోంది.

రామారావు తాంబూలం వేసుకుంటూ, ఎందుకో గుర్తు తెచ్చుకున్నాడు నిన్నటి 'నల్లకుక్క' సంఘటన.

ం ం ం

మరోరోజు -

రామారావింట్లో ఒక పెంపుడు పిల్లి వుంది. ఆరోజు అందరూ భోంచేశాక రామారావు భార్య పిల్లికి పక్కేసి "ఒసే చిన్నీ యిలారా యిక్కడ పడకేశాను పడుకోవే ముండఖానా!" అంటూ పిల్చి బిడ్డకు చెప్పినట్లు చెప్పి తను పడుకొని, లైటు ఆర్పి బెడ్‌లైట్ వేసింది. అందరూ గాఢనిద్రలో వున్నారు, "మ్యావ్"మన్న పిల్లి కేకతో రామారావు ఉలిక్కిపడి లేచాడు.

"ఏమేవ్! మన చిన్నిని ఏదో గండు పిల్లి కరిచేస్తోంది చూడు"

మెర్క్యూరీ బల్బ్ వేసింది. లైటు వేసిందే తడవుగా చిన్నిమీదనుంచి ఓ గండుపిల్లి లేచి, ఒక్క గెంతులో కిటికీ అవతలికెళ్ళింది.

"చిన్నీ! ఒసేయ్! లక్షణంగా నీకు పడకేస్తే నీ బుద్ధి పోనిచ్చుకున్నావ్‌గాదు" అంటూ చిన్నిని ఓ రెండు దెబ్బలేసి, పక్కమీద కూలేసింది. "మ్యావ్" మంటూ అరుస్తూ అలానే నిద్రపోయింది చిన్ని.

అంతటి నిద్రమత్తులోనూ నల్లకుక్క కోడిపెట్టా గుర్తొచ్చాయి రామారావుకి.

ం ం ం

ఒకరోజు -

రాత్రి ఏడుగంటలు కావస్తూంది. రామారావు ఏదో పనిమీద టౌనుకెళ్ళి, తిరిగితిరిగి, అలసిపోయాడు. దగ్గర్లో వున్న పార్కుకెళ్ళి అలసట తీర్చుకుందామని వెళ్ళాడు. ఓ సిమెంట్ బెంచీమీద కూర్చున్నాడు. కూర్చున్నంతనే పడుకోమని గోల చేశాడు జీవుడు. అలాగే నడుం వాల్చాడు రామారావు.

పార్కులో జనం పల్చపల్చగా వున్నారు. ఒకరిద్దరు ప్రేమికజంటలు తప్పించి వేరే ఎవ్వరూ కన్పించలేదు. అలగే నిద్ర పట్టేసింది రామారావుకి.

"అయ్యో! ఏమండీ! నన్నొదలండీ! ప్లీజ్! నేనలాంటిదాన్ని కాదు. ప్లీజ్" అంటుందో ఆడగొంతు.

"నరేలేవే పెద్ద చెప్పొచ్చావ్! ఊ!!" అంటూ గంభీరమైన మగగొంతూ, వినొచ్చి, ఆ శబ్దం వచ్చిన దిక్కుకేసి నడిచాడు. ఓ గుబురు పొదల చాటున ఓ స్త్రీ అర్ధనగ్నంగా వుంది.

ఓ చేయి గుండెల చాటు చేసుకొని మరోచేత్తో, కాళ్ళతో పెనుగులాడుతోంది.

కానీ—

ఆ స్త్రీ పురుషుని శక్తిముందు అశక్తురాలైంది.

పెనుగులాటలో ఓడిపోయింది.

పురుషుని చేతిలో లొంగిపోయింది ఆ యువతి.

ఆ అరాచకాన్ని, రాక్షస కృత్యాన్ని చూస్తూ, ఊరుకుండిపోయాడు మునలి రామారావు

రామారావు ఆలోచిస్తున్నాడు-

రామారావు నడుస్తున్నాడు -

రామారావు మదిలో ఒకనాటి కుక్క, పిల్లి, కోడి మెదలాయి ఎందుకో అతని పెదవులపై చిరుదరహాసం పేలవంగా మెదిలి మాయమైంది. ★